# ఇంద్రాణి

శివకుమార బెనర్జి చనిపోయాడని తెలిసినప్పుడు నా కళ్ళ నుంచి ఓ నీటిబిందువైనా రాలలేదు యీ ప్రపంచంలో నేను కంటతడి పెట్టవలసినంత కారణం అయేవాళ్ళు యిద్దరే యిద్దరు వాళ్ళల్లో బెనర్జీ వొహాడు

“అదృష్టవంతుడు నాకన్న ముందుపొయ్యాడు” అనిమాత్రమే ఆవార్త పత్రికలో చదివినప్పుడు అనుకున్నాను కాని మరసటి రోజున అతని తమ్ముడు రాసిన వుత్తరం సాంతం చదవగానే నా హృదయం బద్దలైంది బెనర్జీ అలాంటి చావును ఎదుర్కోవలసివస్తుందని నేనెన్నడూ అనుకోలేదు అతడూ అనుకొని వుండడు

ఆరు సంవత్సరాల అండమాను జీవితాన్నీ, నాలుగైదు సంవత్సరాలు బ్రిటిష్ రాక్షసపాలనలో, బెంగాల్‌లోని అన్ని జైళ్ళలోని నికృష్టజీవితాన్నీ బాధలనీ తట్టుకుని బయటపడిన బెనర్జీ, హఠాత్తుగా యీ పందొమ్మిది వందల యాభైలో,

అశోకచక్రఛాయల్లో జరిగే ప్రభుత్వ పాలనలోని జైల్లో మూడు రోజులకంటె ఎక్కువ బ్రతకలేదంటే నిజంగా నేను నమ్మలేక—వుత్తరం మరోమారు చదివాను

"శవాన్ని యిచ్చేందుక్కూడా అధికారులు నిరాకరించారు" వుత్తరంలోని యీ వాక్యం నన్ను నిలువునా కలచివేసింది ఆ నిమిషాన నాకళ్ళనుంచి అశ్రుజలం ధారగా ప్రవహించింది నాచేతినుంచి వుత్తరం ముక్కుమీదనుంచి జోడూ జారి పోయినై బరువెక్కిన హృదయంతో కుర్చీలోనుంచి లేచి నీరసంగా వంచంమీద నడుంవాల్చాను

అనేక స్మృతులు మంచివీ చెడ్డవీ, బెనర్జీ జీవితాన్నుంచి, అనాడి ఆశయాలనుంచి నన్ను వేరుపరచిన కారణాలూ, అన్నీ నా మనక కళ్ళముందు నీడల్లాగ కదుల్లాడినై

'బెనర్జీని యిలాంటిచావే ఏ పందొమ్మిది వందల యిరవై లోనో ఎదురొక్కొన్నట్టయితే, అతని శవాన్నికూడా యివ్వమని జైలు అధికారులు యిలాగే నిరాకరించి వున్నట్టయితే అప్పటి నా పాతిక ఏళ్ళ యవ్వనోద్రేకంలో ఏమిచేసి వుండేవాణ్ణి?"

యీ ప్రశ్న నాకళ్ళముందు దీర్ఘంగా పరుచుకు పోయింది నా జీవితపు తుదిక్షణాలవరకూ నేను మోసుకుపోవలసిన బరువు చావో—బ్రతుకో తేల్చుకోవలసిన సంధిసమయంలో నాతోటి వాళ్ళనుంచి విడివడిన నాపిరికిగుండె, అందుకారణమైన ఇంద్రాణి ఆనాటి బెంగాల్ విప్లవోద్యమం అన్నీ నా మనో నేత్రాలముందు గజిబిజిగా అల్లుకు పోయినై

ఇంద్రాణి! ఆపేరు యీ నా యాభై ఐదేళ్ళ ముసలి దేహంలో కలిగించే వుద్రేకం నిశ్శబ్దంగా, భారంగా కదుల్లాడే

నా గుండెల్లో రగిల్చే బాధా, వేగిరపాటూ అంతా యీ నిమిషాన నన్ను ఏదో కొత్తప్రపంచంలోకి—గతించిన కాలం మధ్యకీ, సంఘటనల్లోకీ లాక్కుపోతోంది

కలకత్తాలోనే మొదటిసారి ఆమెను చూశాను రైల్వే వర్క్ షాపులో పని కాగానే సరాసరి బెనర్జీ యింటికి వెళ్ళేవాణ్ణి అప్పటికి బెనర్జీ కాలేజీలో ప్రవేశించి సంవత్సరం కావొచ్చు నాకన్న ఐదేళ్ళు చిన్న

ఆరోజు సాయంకాలం నేను ఓ అరగంట ఆలస్యంగా అతడి యింటికి వెళ్ళాను బెనర్జి మాంచి వుత్సాహంగా వున్నాడు ఆనాటి పత్రికలోని అనేక విషయాల్ని గురించి చర్చించాం యూరపులో రగులుతున్న విప్లవాలూ, కాంగ్రెసులో అతివాదులకీ, మితవాదులకీ జరుగుతున్న సంఘర్షణా, కాన్పూరులో బహిరంగసభ జరుగుతుండగా హఠాత్తుగా పోలీసులు దాడిచేసి జరిపిన లాఠీచార్జి—యింకా అనేకం మాట్లాడాం

మామూలు ప్రకారం యిక వెళ్ళేందుకు నేను లేవగానే బెనర్జీ నావంక పరీక్షగా చూసి—"ఆగు! ఓ కొత్త వ్యక్తితో పరిచయం చేస్తాను" అన్నాడు

నేను తిరిగి కూర్చుంటూ అలాంటి సందర్భాల్లో మామూలుగా అడిగే ప్రశ్న అడిగాను "మనవ డేనా?"

బెనర్జీ అనిశ్చయంగా ఓ క్షణకాలంవూరుకుని ఆలోచిస్తున్న ధోరణిలోనే అన్నాడు "యిప్పటికి కాదు బహుశా కొద్ది కాలంలోనే చేర్చుకోవలసి వస్తుంది ధైర్యం, తెలివితేటలు కూడా వున్న యువతి"

నేను నాలుక కొరుక్కున్నాను అంతకు ముందు జరిగిన వొకటి రెండు అనుభవాలదృష్ట్యా, స్త్రీలను చేర్చుకోవడం క్షేమంకాదని నిర్ణయించుకున్నాం పోలీసుల హింసలకు వాళ్ళు ధైర్యంగా నిలబడలేరనీ, అందువల్ల సమితిలోకి తీసుకోకూడదనీ అనుకున్నాం

బెనర్జీ పక్కగదిలోకి వెళ్ళి రెండు మూడు నిముషాల్లో ఓ యువతితో తిరిగివచ్చాడు ఆమే ఇంద్రాణి!

ఆరోజున ఏమిమాట్లాడామో బాగా గుర్తులేదు కాని ఒకటి మాత్రం చెప్పగలను ఏ ముఖ్య విషయాలూ రాలేదు ఆమె నన్నే విధంగానూ ఆకర్షించలేదు, తెల్లవారి లేస్తే బజారుల్లోను, యిళ్ళల్లోనూ కనబడే అనేకమంది యువతుల్లో—ఆమే ఒకతిగా కనబడింది అంతే!

కాని రెండునెలల తరవాత, ఆమె నాజీవితానికి ఓ సమస్యగా తయారైంది అలా జరుగుతుందని నే నెన్నడూ వూహించలేదు క్రమ క్రమంగా ఏరు వొడ్డును రేణువులదగ్గిరనుంచి ప్రారంభించి ఓ పెద్ద అండను కోసినట్టుగా, ఇంద్రాణి నా హృదయాన్ని నేను గ్రహించలేనంత సున్నితంగా కోసి తన గుప్పెట్లో దాచుకుంది

మిడ్నపూర్‌లో బాంబు విసరడం జరిగింది దానికి ప్రతీకారంగా ప్రభుత్వం అనేకమందిని అరెస్టు చేసింది ఎవడో వొక్కడు చేసిన ఆపనికి అతడు దొరకనందున పోలీసులు విచ్చలవిడిగా దాడులుచేసి ఏ సంబంధములేని వ్యక్తుల్ని జైళ్ళల్లో కుక్కారు

"బ్రిటిష్ ప్రభుత్వానికి అంత్యదినాలు దగ్గిరపడుతున్నయ్ యిక్కడ—కలకత్తాలో మనం ఏదో వొకటి చేసితీరాలి"

అన్నాడు బెనర్జీ. రుణో మిత్రా, దిలీప బోసూ, అతడి తమ్ముడూ, యింకా అక్కడవున్న నలుగు రైదుగురు వెంటనే బలపరిచారు. నేను దీర్ఘాలోచనలో పడ్డాను.

సమితిలో రెండు సంవత్సరాలనుంచి సభ్యుడుగావున్న నాకు, ఆ "ఏదో వాహాటి చేసితీరాలి" అన్న బెనర్జీమాటల అర్థం బాగా తెలుసు. ప్రజల్ని భయభ్రాంతుల్ని చేయాలన్నదృష్టితో విచ్చలవిడిగా అరెస్టులూ, స్త్రీలను మానభంగాలూ చేసే ఏ పోలీసు ఆఫీసరుమీదో బాంబు విసరాలి, అది వీలైతే చీకటిమాటున. వీలుకాకపోతే పట్టపగలు ఏ బజారులోనో. తరవాత పోలీసులకు పట్టుబడి వాళ్ళ తుపాకిగుండు తలలోనుంచో, గుండెల్లోనుంచో పేల్చేముందు, "విప్లవం వర్ధిల్లాలి! అంటూ యీ జీవితాన్ని ముగించాలి.

నేను ఆలోచిస్తూ అలాగే వుండిపోయాను. రెండు నెలలకు పూర్వం ఇలాంటి సమస్యే ఎదుర్కొన్నట్టయితే, ఆ మాట్లాడేది బెనర్జీకాక నేనైవుండేవాణ్ని. బ్రిటిష్ పాలకుల్లోని రాక్షసత్వం, దాన్ని బలపరచే యిండియన్ పెంపుడుకుక్కలూ, స్వాతంత్ర్యం ఎలా మన జన్మహక్కో, రూసో, థామస్ పెయిన్, గారిబాల్డి, వాషింగ్టన్—అన్నిటిని గురించీ అందర్ని గురించీ ఓ గంట అయినా మాట్లాడి వుండేవాణ్ని. కాని ఆ నిమిషాన దేశాని కన్నా, స్వాతంత్ర్యానికన్నా, కీర్తి - త్యాగం, అన్నిటికన్నా— గొప్పదిగా, వుత్తమోత్తమమైందిగా జీవితలక్ష్యంగా, జీవిత సాఫల్యంగా, ఒకే ఒక మూర్తి నా హృదయంలో కదులాడింది. ఆ మూర్తి నన్ను కర్తవ్యతా విమూఢున్ని చేసిన ఆ శక్తి— ఇంద్రాణి!

బెనర్జి నా పక్కన కూర్చుని భుజంపట్టుకుని కదిలించి నప్పుడు—మౌనంగా అతడి మొహంలోకి చూశాను

"లోగడ నిన్ను మీ ఆంధ్రప్రాంతానికి పంపాలనికూడా మనవాళ్ళు అనుకున్నారు నేనే వద్దని సలహా యిచ్చాను ఎందుకో తెలుసా? నీకు ఆచరణలో అవసరమైనంత అనుభవం లేదు యిక్కడ వున్నవాళ్ళు అంగీకరిస్తే యిక్కడ బ్రిటిష్ సామ్రాజ్యాన్ని మొదటిదెబ్బకొట్టే అవకాశం నీకివ్వాలనివుంది ఏమంటావ్?"

బెనర్జీ యీ మాటలన్నీ స్పష్టంగా అన్నాడు అతనిచేయి నా భుజంమీద అటూ యిటూ కదుల్తూనేవుంది అతడి మాటలన్నీ స్ఫుటంగా నా చెవుల్లో ప్రతిధ్వనించినై కాని నా హృదయంలో ఇంద్రాణిరూపం ఆమె నవ్వులూ కదిలి మారు మ్రోగినై

"ఆలోచిద్దాం!" అంతకంటే నా నోటినుంచి మాటలు పెగలలేదు పరస్పరం సంఘర్షించే రెండు బలమైన ప్రవాహాల మధ్య చిక్కుకున్నవాడిలా ఉక్కిరి బిక్కిరియ్యాను

బెనర్జి ఓరెండు నిమిషాలు నా ప్రక్కన అలాగే కూర్చు న్నాడు అందరికళ్ళూ నా వైపుకే తిరిగినట్టు గమనించాను నేను ఎరికవాణ్ణని అందరూ భావిస్తున్నట్టు ఆ చూపులు నాకు కనబడినై అయినా నేనేమీ మాట్లాడలేదు బెనర్జియే మళ్ళా అన్నాడు—

ప్రభుత్వానికి పిచ్చెత్తింది ఇంద్రసేన్‌ని ఎలాచంపారో తెలుసా" నాగొంతులోనుంచి అప్రయత్నంగా ఓ వికృతశబ్దం బయట పడింది యింద్రసేన్ నాకు కలకత్తాలో వుద్యోగం

కదిర్చినవాడు అతడేగనక నాకు సమయానికి సాం పడకుండా వున్నట్టయితే——ఆదూర ప్రాంతంలో నిరుద్యోగానికీ, ఆకలికీ తట్టుకోలేక ఏ రైలుకిందనో పడి జీవితాన్ని ముగించివుండేవాణ్ని నాకు సమితితో పరిచయంకూడా అతడే కలిగించాడు

"దేశం రెండు శత్రుశిబిరాలుగా చీలిపోయింది బ్రిటిష్ ప్రభుత్వం——దాన్ని బలపరచే ద్రోహులూ స్వాతంత్ర్యం కోరే ప్రజలూ, వాళ్ళమీద మనకు జాలిలేదు ప్రజలమీద జాలి చూపమని కోరం కాని పోరాటంలోకూడా ఒక నీతి వుంది వాళ్ళమీద మనం బాంబో, తుపాకిగుండో వుపయోగిస్తాం చాతనైతే మామీద అదే ప్రయోగించమని కోరతాం కాని మనిషిని పట్టుకుని హింసించి, రాక్షసుల్లాగా బాధించి చంపడం, ఏమాత్రం సహించరానిది ఇంద్రసేన్‌న్ని దారుణంగా హింసించి చంపారు తుపాకులతో పొడిచీ, లారీలతో కొట్టీ ప్రాణం తీశారు"

బెనర్జీ గొంతు రుద్ధమవడం, వుద్రేకంతో పళ్ళు బిగించడం గమనించాను నాలో దుఃఖం పొంగులు వారింది ఆ క్షణంలో బెనర్జీ నా చేతి ఏబాంబో, రివాల్వరో యిస్తే ఏమిచేసి వుండే వాణ్నో నాకు తెలీదు కాని ఒకటి మాత్రం నిజం యీనాటి వరకూ జీవించివుండి అందరు స్నేహితుల చావుల్నీ——యీనాడు ఆ బెనర్జీ మరణాన్నీ చూసి, నిస్సహాయంగా దుఃఖిస్తూ, యీ విధంగా నిర్వేదాన్ని అనుభవించి మాత్రం వుండేవాణ్ని కాదు

బెనర్జీ పెద్దపొరపాటుచేశాడు ఇంద్రాణినీ నా పిసరాన్నీ, నన్నూకూడా మరిచిపోయిన ఆక్షణంలో నాకేమీ కర్తవ్యం చెప్పలేదు నా కళ్ళవెంట కారే నీటిబిందువుల్ని చూసి——

"రేపు శెలవుపెట్టు వుదయం ఎనిమిదింటికల్లా వస్తే మాట్లాడదాం" అన్నాడు

ఆదేక్షణాన్నుంచి నాజీవితం, వాళ్ళందరి జీవితాల్నుంచి వేరై మరోమార్గాన, కేవలం భిన్నమార్గాన పడి కుంటువడింది

ఆరాత్రి నాకు నిదరపట్టలేదు పరస్పర వైరుధ్యాలతో నామనస్సు చిన్నా భిన్నమై పోయింది హృదయంలో ఎక్కడో అట్టడుగున తొక్కివుంచిన కోర్కెలూ, ఆశలూ, దౌర్బల్యాలూ, నా జీవితాశయాలమీద దాడిచేసినై నాలోని ద్వంద్వత్వం బతుకుమీది తీపీ, ఎన్నోఏండ్లు జీవించి యీప్రపంచంలో జరిగే మార్పుల్ని చూడాలనీ ఇంద్రాణివల్ల స్వర్గ సౌఖ్యాలని అనుభవించాలనీ నాలో విపరీతమైన ఆవేదనా, స్వార్థం గజ్జెకట్టి విలయతాండవం చేసింది కాని జరిగిపోయిన విషాద మేమిటంటే అప్పట్లో ఆ అవస్థలో నా బుద్ధికి అది ఏమాత్రం నేరంగాగాని, దౌర్బల్యంగాగాని కనపడలేదు పాతిక సంవత్సరాల తరవాత, యీనాడు మాత్రమే, ఆనాటి నాస్వార్థ చింతని పూర్తిగా గ్రహించ గలుగుతున్నాను నన్ను ప్రేమించి నానుంచి ఎంతో ఆశించిన బెనర్జీ మరణం బహుశా యీనాడు నాలో యింతమార్పును కలిగించి వుండవొచ్చు

ఆ మర్నాడు శెలవైతే పెట్టానుకాని, బెనర్జీ యింటికి మాత్రం వెళ్ళలేదు నాలో ఏదో అగ్నిపర్వతం రగులుతూనే వుంది ఏదో నేరం బ్రతికివున్నంతవరకూ సిగ్గుతో తలవంచుకో వలసిన నేరం చేస్తున్నట్టు బాధపడ్డాను ఏదో ఆరాటం, తెలియనిబాధా నన్ను కుంగదీసినై భగవద్గీతతీసి, కర్మయోగం చదివేందుకు ప్రయత్నించాను బుర్రకు ఏమాత్రం ఎక్కలేదు

విసుగ్గా ఆ పుస్తకాన్ని బీరువాలోకి నెట్టి చేతికి అందిన మరో పుస్తకాన్ని లాగాను కుర్చీమీద కూర్చుని ఆలోచిస్తూ పుస్తకం తెరిచాను "రుబాయత్!" నాదృష్టి అక్కడవున్న పద్యంమీద పడింది చదివాను అందులోని ఆఖరిచరణం Sans wine Sans End! అన్నదాన్ని ఎన్నోమార్లు చదివాను జీవితానికి ఓకొత్త అర్థం, ఓకొత్తవిలువలు కనబడి నట్టయింది ఆసాయంకాలం కూడా బెనర్జి యింటికి వెళ్ళలేదు దేశభక్తి స్వాతంత్ర్యం, అన్న పదాలకు అర్థం నాకు మరో నూతన రూపంలో కనబడింది త్యాగం ఎందుకు చేయాలి? ఎవరికోసం చేయాలి? అనుభవించేది నేను కానప్పుడు ఎవరికోసమో ఎందుకు చావాలి? యిలాంటి ప్రశ్నలు నన్ను చుట్టుముట్టినై వాటినుంచి తేలికైన హృదయంతో బయటపడ్డాను

ఆ రాత్రి తొమ్మిదిగంటలకు ఇంద్రాణి యింటికి వెళ్ళాను మనసులో ఎంతగా ఆమెను గురించి మధనపడుతున్నా—అంత వరకు ఆమెకు నా ప్రేమసంగతి చెప్పలేదు ఏదో ఓ శుభ ముహూర్తాన, అట్టే ప్రయత్నం లేకుండానే ఆ విషయం చెప్పే అవకాశం కలుగుతుందని ఆశించాను

ఇంద్రాణి నన్ను లోనికి ఆహ్వానించింది మామూలుగానే మాట్లాడింది సందర్భంకోసం కాచుకూర్చున్న నాకు, నాహృదయంలోని బాధని బయటపెట్టేందుకు అవకాశం చిక్కలేదు

పన్నెండు గంటలకు తిరిగి రూముకువచ్చి పడుకున్నాను నాకనేక అనుమానాలు కలిగినై నేను ఇంద్రాణిని గురించి పొరబడడం లేదుగదా? యీ సరికే ఆమె మరెవర్నయినా ప్రేమిస్తోందేమో? అయితే నన్ను గురించీ, నా తెలివితేటల్ని

గురించీ యితర్లవద్ద మెచ్చుకోవడం, నేను ఎంతో మంచి వాణ్నానీ, గొప్ప వాణ్ననీ అందరితో చెప్పడంలో ఆమె వుద్దేశ్యమేమై వుంటుంది?

యీ తెగనిసమస్యతో చాలారాత్రివరకూ బాధపడ్డాను నేను ఏమాత్రం ప్రోద్బలం యిచ్చినా, ఆమె ముందు నాప్రేమను అర్థిస్తుందని గత రెండునెల్లనుంచి ఆమెను పరిశీలనగా చూస్తున్న నాకు తోచింది ఆమెకోసమే నేను జీవించదలుచుకున్నాననీ ఆకారణంగా ప్రమాదాల్లోకి యీడ్చే తీవ్ర రాజకీయాలనుంచి విరమించుకుంటున్నాననీ తెల్లవారగానే ఆమె యింటికి వెళ్ళి చెప్పడం—అన్నివిధాలా మంచిదని నిర్ణయించు కున్నాను

కలతనిద్దరలో నాకు ఎవరో తలుపు గట్టిగా తడుతూన్న శబ్దం వినబడింది కళ్ళు నలువుకుంటూ లేచివెళ్ళి తలుపు తెరిచాను పన్నెండేళ్ళ కుర్రాడు నా చేతిలో ఓ కవరు పెట్టి, గిర్రున తిరిగి వెళ్ళిపోయాడు నేను ఆశ్చర్యపడుతూ ఆ వైపుకు ఓ నిమిషం చూసి, కవరు చింపాను లోపలి వుత్తరం నన్ను మరింత ఆశ్చర్యపరిచింది

నన్ను సమితినుంచి బహిష్కరించినట్టూ, ద్రోహిగాకాక పిరికితనం కారణంగా బహిష్కరణ జరిగింది కనక సమితి రహస్యాలు యితర్లతో చెప్పనంతవరకూ శత్రువుగా మాత్రం చూడరనీ బెనర్జీ మొత్తం సమితి తరఫున రాశాడు కాని కింద బెనర్జీ సంతకం లేదు అయినా అతడి దస్తూరీ నాకు బాగా తెలుసు

నన్ను ఓ పక్క అవమానం, మరోపక్క ఆనందం వుక్కిరి బిక్కిరి చేసినై పిరికివందగా అందరూ నిర్ణయించినందుకు

ఎంతో సిగ్గూ, బాధా కలిగినా, ప్రాణాపాయంతో కూడిన ఆ కార్యక్రమాల్లోనుంచి బయటపడి, స్వేచ్ఛగా ఇంద్రాణితో జీవిత శేషాన్ని గడిపే అవకాశం కలిగినందుకు సంతోషం కలిగింది

ఏడుగంటలకల్లా స్నానంచేసి, వున్న వాటిలో మంచి బట్టలు వేసుకుని ఇంద్రాణి యింటికి బయలుదేరాను ఆమెతో చెప్ప వలసిన మాటలూ, నా ప్రేమను వెల్లడించేప్పుడు ఆమెకు నేను ఎంతదగ్గిరలో వుండవలసిందీ — యింకా యిలాంటివే అనేక విషయాలు సూక్ష్మాతిసూక్ష్మంగా ఆలోచించి, నడుస్తూనే కొన్ని వాక్యాల్ని రిహార్సిల్సు చేశాను

నేను తలుపుతట్టినప్పుడు ఇంద్రాణి అరవైఏళ్ళ ముసలితల్లి తలుపు తెరిచింది "ఇంద్రాణి ఏంచేస్తున్నది?" అని అడగగానే ఆమె నావంక అదోలాచూసి, "యింట్లోలేదు" అని జవా బిచ్చింది

ఆమె ఎక్కడికి వెళ్ళిందన్న ప్రశ్న వేయకుండానే తిరిగి వచ్చాను ఎక్కడికివెళ్ళినా కనీసం రాత్రి ఎనిమిది తొమ్మిది గంటలకు తప్పక యింటికి వస్తుందని నాకు తెలుసు

ఆ రాత్రి ఎనిమిది గంటలకు రూము తాళంవేసి, ఆనం దంతో మునకలువేస్తున్న హృదయంతో ఇంద్రాణి యింటికి బయలుదేరాను రెండుమూడు ఫర్లాంగులునడిచి, ఆ యింటికి వెళ్ళే రోడ్డుమలుపు తిరగగానే అక్కడ కనుపించిన దృశ్యం నాలో ఆశ్చర్యాన్ని,అంతకంటె ఎక్కువగా భయాన్నీ కలిగించింది

రోడ్డుకు అడ్డంగా కొంతమంది పోలీసులు నిలబడి, ఎవరివాళ్ళను అక్కడే ఆపేస్తున్నారు దూరంగా ఇంద్రాణి యింటి ముందు రెండువానులూ కొంతమంది పోలీసులూ కనుపించారు

బరువెక్కిన హృదయంతో అక్కడే నిలబడి ఆ దృశ్యంవంక ఓ నాలుగైదు నిమిషాలుచూసి, భయపడుతూనే, అక్కడున్న ఓ వ్యక్తిని ఏం జరిగిందని అడిగాను

"ఆ యింట్లోవుంటే అమ్మాయి పోలీసు సూపరింటెండెంటు మీద బాంబు విసిరిందట! ఆ అమ్మాయిని అరెస్టుచేసి, యిల్లు సోదాచేస్తున్నారు"

నా కాళ్ళక్రింద భూమి జరిగినట్టయింది మళ్ళీ ఆయింటివేపు కేనా చూడకుండా తడబడుతూన్న కాళ్ళతో సాధ్యమైనంత వేగంగా నడిచి రూముకు చేరాను

దీపం వెలిగించి తలుపులోపల గడేసేందుకు వెళ్ళినప్పుడు తలుపు పక్కగా ఓ కాయితంకనబడింది వణుకుతున్న చేతుల్తో మడతలువిప్పి చదివాను

"జరిగిన సంగతి తెలిసేవుంటుంది ద్రోహివికాదనీ—పిరికి వాడివి మాత్రమే అనీ అనుకుంటున్నాం"

అది బెనర్జి రాసిందే!

అప్పటికప్పుడే నేను మోయగలిగినంత సామానుమాత్రమే తీసుకుని రైల్వేస్టేషనుకు చేరాను మొదటగా బయలుదేరినబండి ఎక్కేశాను—అంతే! నా పతనం పూర్తయింది!

* * *

బెనర్జీ మరణం నాజీవిత చిత్రాన్ని మరోమారుఅవలోకించే అవకాశం నాకు కలిగించింది అతని వుద్దేశంలో నేను అప్పటికీ, ఆ తరవాతకూడా పిరికిపందనేకాని ద్రోహానిమాత్రం కాదు

బ్రిటిష్ సామ్రాజ్యవాదంమీద కత్తి ట్టిన బెనర్జి, అది పోయినతరవాత మరెవరిమీద కత్తికట్టాడో నాకు యిప్పటికి

అనూహ్యాంగానే వుంది నాలుగు నెల్లనాడు అతడు రాసిన వృత్తాంతంకూడా నాదగ్గిర వుంది అయినా అతడు చెప్పిన రాజకీయాలూ సిద్ధాంతాలూ, నాకు అర్థం కాలేదు అంతా కొత్తగా అయోమయంగా కనబడినై

బెనర్జి మరణించిన తరవాతైనా అతడు కొత్తగా స్వీకరించిన రాజకీయాన్ని అర్థం చేసుకోగలనేమో అని ఆ వృత్తరం డ్రాయరులోనుంచి బయటకు తీశాను ఎక్కడో జారిపడిపోయిన చత్వారపుజోడు ఎంత వెతికినా కనబడలేదు అక్షరాలు మసకమసగ్గా కనబడుతున్నయ్

"మనం ఆశించిన స్వరాజ్యం రాలేదు ట్రాంవే వర్కర్సులో పనిచేస్తున్నాను " ఆపైన చదవలేకపోయాను కళ్ళ నిండా నీరు కమ్మింది మనం ఆశించిన స్వరాజం ఏమిటి? బ్రిటిషువాళ్ళని వెళ్ళగొట్టటం! అది జరిగిందిగదా? అంత కంటె ఎక్కువ ఆరోజుల్లో బెనర్జీగాని, నేనుగాని, సమితిలోని యితరసభ్యులుగాని ఆసించింది మరేమీవున్నట్టు నాకుగుర్తులేదు

బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదిరించి బతక కలిగిన బెనర్జీ, వాళ్ళు వెళ్ళిన తరవాత తిరిగి జైలు కెళ్ళాడు మూడురోజుల కంటె యీసారి ఎక్కువ బతకలేకపోయాడు!

ఇందులో ఏదో దుర్భేద్యమైన రహస్యం వుందనీ, నూతన సత్యాల్నీ, కొత్తమార్గాల్నీ చూపేందుకు బెనర్జీ ప్రయత్నించాడనీ యిప్పుడు నాకు తోస్తోంది

కాని, పాతికవేళ్ళ నిండుయవ్వనంలో ఇంద్రాణి రూపం! నన్ను పిరికిపందను చేసింది జవసత్వా లుడిగిన యాభై ఐదేళ్ళ శరీరం, తిరిగి అదేస్థితికి నన్ను దిగలాగుతోంది